క్లుప్తంగా

పరీక్ష సామగ్రి అందజేత



నెల్లూరు(బారకాసు): పదో తరగతి పరీక్షల్లో మున్సిపల్ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చాలని మేయర్ స్రవంతి కాంక్షించారు. మున్సిపల్ పాఠశాలల్లో చదువుతున్న 1425 మంది పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్‌లో బుధవారం అందజేశారు.

ఉత్సాహంగా పోటీలు



ప్రతిభ చూపిన వారికి సర్టిఫికెట్ల ప్రదానం

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో క్యాడెట్, సబ్ జూనియర్స్, జూనియర్ స్కే స్టేట్ లెవల్ చాంపియన్‌షిప్‌ను స్కే స్పోర్ట్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. విజేతలకు సర్టిఫికెట్లు, పతకాలను అందజేశారు. ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంతియాజ్, అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇబ్రహీం, నన్నే సాహెబ్, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

బీసీ యువజన సంఘ రాష్ట్ర అధ్యక్షుడిగా సుభాష్‌యాదవ్



నియామక పత్రాన్ని అందజేస్తున్న కృష్ణయ్య

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): బీసీ యువజన సంఘ రాష్ట్ర అధ్యక్షుడిగా మద్దులూరు సుభాష్ యాదవ్‌ను సంఘ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్య నియమించారు. ఢిల్లీలోని ఏపీ భవన్‌లో గల అంబేడ్కర్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో నియామక పత్రాన్ని అందజేశారు. బీసీల సంక్షేమానికి కృషి చేస్తానని సుభాష్‌యాదవ్ తెలిపారు.

విజన్ డాక్యుమెంట్‌ను తయారు చేయండి



మాట్లాడుతున్న ఆనంద్

నెల్లూరు రూరల్: స్వర్ణాంధ్ర – 2047 ప్రణాళికను రూపొందించడంలో నియోజకవర్గాల ప్రత్యేకాధికారులు అత్యంత శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర – 2047 యాక్షన్ ప్లాన్‌ను నియోజకవర్గ స్థాయిలో తయారు చేయడం తదితరాలపై జిల్లా అధికారులు, నియోజకవర్గ ప్రత్యేకాధికారులకు వర్క్ షాప్‌ను జిల్లా ప్రణాళిక శాఖ అధికారి నరసింహులు ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో బుధవారం నిర్వహించారు. కమిషనర్ సూర్యతేజ, ఆర్డీఓలు అనూష, పావని, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ నేతలతో సమావేశం



మాట్లాడుతున్న కార్తీక్

నెల్లూరు(అర్బన్): ప్రకాశం జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ నేతలతో సమావేశాన్ని జేసీ కార్తీక్ తన చాంబర్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో రైతులు పండిస్తున్న ధాన్యాన్ని అవసరం మేరకు ప్రకాశం జిల్లా మిల్లర్లకు తరలిస్తామని చెప్పారు. దీనికి సహకరించి బ్యాంక్ గ్యారెంటీలను ఇవ్వాలని కోరారు. తమ వంతు సహకారం అందిస్తామని మిల్లర్లు హామీ ఇచ్చారు. పౌర సరఫరాల జిల్లా అధికారి అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ బదిలీ

నెల్లూరు(అర్బన్): నెల్లూరు ఆర్డీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తూ అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న అర్షద్‌ను కలెక్టర్ ఆనంద్ ఆదేశాల మేరకు బదిలీ చేశారు. ఈ మేరకు ఉత్తర్వులను ఆర్డీఓ అనూష జారీ చేశారు. ఎలక్షన్ విధులు నిర్వర్తిస్తున్న ఆయన్ను ఉదయగిరి మండలానికి బదిలీ చేశారు.

ఘనంగా వైఎస్సార్సీపీ ఆవిర్భావ దినోత్సవం





కేక్‌ను కట్ చేస్తున్న మహిళలు, ఆనం అరుణమ్మ తదితరులు

నెల్లూరు(బారకాసు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నెల్లూరు నగర, రూరల్ నియోజకవర్గాల్లో ఘనంగా బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేశారు.

- రామ్‌జీనగర్‌లోని పార్టీ సిటీ నియోజకవర్గ కార్యాలయంలో కార్యక్రమాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేక్‌ను మహిళా నేతలు కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో పార్టీ తిరుగులేని శక్తిగా ఎదగనుందని చెప్పారు. పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు ఎంతో శ్రమిస్తున్నారని తెలిపారు.
- చింతారెడ్డిపాళెంలోని పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి నివాసంలో పార్టీ ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. తొలుత పార్టీ జెండాను జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ఎగురవేశారు. అనంతరం కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.

పేదల సంక్షేమమే ధ్యేయంగా తమ పార్టీ ఆవిర్భవించిందని చెప్పారు.

బడ్జెట్ రూపకల్పన పూర్తి

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ బడ్జెట్ రూపకల్పన ప్రక్రియను కమిషనర్ సూర్యతేజ నేతృత్వంలో పూర్తి చేశారు. ఈ మేరకు కార్పొరేషన్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో అన్ని విభాగాధికారులతో సమావేశాన్ని కమిషనర్ బుధవారం నిర్వహించారు. అన్ని విభాగాలకు సమప్రాధాన్యాన్ని కల్పిస్తూ బడ్జెట్‌ను రూపొందించామని తెలిపారు.

రెండు నుంచి టీ - 20 క్రికెట్ టోర్నీ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): సింహపురి ప్రీమియర్ లీగ్ టీ – 20 పోటీలను ఏప్రిల్ రెండు నుంచి 12 వరకు నిర్వహించనున్నామని నిర్వాహకుడు వంశీకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుజబుజనెల్లూరులోని సీఐఏ క్రికెట్ గ్రౌండ్స్‌లో పోటీలను ఏసీఏ, ఎన్డీసీఏ సహకారంతో నిర్వహించనున్నామని చెప్పారు. 16 నుంచి 30 ఏళ్లలోపు వారు అర్హులని, ఎనిమిది జట్లకే అవకాశం ఉంటుందన్నారు. సీఐఏ గ్రౌండ్స్‌లోని క్రికెట్ నెట్స్‌లో తమ నైపుణ్యాన్ని క్రీడాకారులు ఈ నెల 16న ప్రదర్శించాలని కోరారు. వివరాలకు 89199 18304 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ప్లాస్టిక్ ఉత్పత్తులను వినియోగించొద్దు



పరిశీలిస్తున్న సూర్యతేజ

నెల్లూరు(బారకాసు): నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తులను నగరపాలక సంస్థ పరిధిలో వినియోగించొద్దని కమిషనర్ సూర్యతేజ సూచించారు. 50వ డివిజన్లోని పినాకినీ పార్క్, రంగనాయకులపేట, ఉప్పరపాళెం తదితర ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పినాకినీ పార్కు నిర్వహణకు అదనపు సిబ్బందిని నియమించి, ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రంగనాథస్వామి రథోత్సవాన్ని పురస్కరించుకొని ఆ ప్రాంతంలో ఆక్రమణల్లేకుండా చూడాలని పేర్కొన్నారు. భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా పారిశుధ్య పనులను నిరంతరం చేపట్టాలని కోరారు. కాలువల్లో వ్యర్థాలేసే వారిని గుర్తించి జరిమానాలను విధించాలని ఆదేశించారు. ఇంజినీరింగ్ విభాగ ఎస్‌ఈ రామ్మోహన్‌రావు, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, వెటర్నరీ డాక్టర్ మదన్‌మోహన్, ఉద్యాన శాఖ ఏడీ ప్రదీప్‌కుమార్, రెవెన్యూ ఆఫీసర్ ఇనాయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

పార్కుల ఆధునికీకరణకు వినతి



ఎస్‌ఈకి వినతిపత్రమిస్తున్న సభ్యులు

నెల్లూరు(బారకాసు): నగరంలోని పార్కులను ఆధునికీకరించాలని జనతా వాకర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ముక్కు రాధాకృష్ణగౌడ్ కోరారు. ఈ మేరకు డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఎస్‌ఈ రామ్మోహన్‌రావుకు వినతిపత్రాన్ని అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం అందజేశారు. అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శులు మధు, ఉదయ్ కుమార్, ఉపాధ్యక్షుడు తిరకాల శివగౌడ్, జిల్లా కార్యదర్శులు మునిబాబు, చరణ్‌తేజ తదితరులు పాల్గొన్నారు.

క్షయ నివారణే లక్ష్యం



మాట్లాడుతున్న ఖాదర్‌వలీ

నెల్లూరు(అర్బన్): జిల్లాలో క్షయ నివారణే లక్ష్యంగా ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులు కృషి చేయాలని ఏడీఎంహెచ్‌ఓ, జిల్లా టీబీ నివారణాధికారి ఖాదర్‌వలీ పేర్కొన్నారు. దర్గామిట్టలోని ప్రభుత్వ ఏసీఎస్సార్, నారాయణ మెడికల్ కళాశాలల్లో బుధవారం నిర్వహించిన టీబీ నివారణ కోర్ కమిటీ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. టీబీని నూరు శాతం అరికట్టేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు. టీబీ రోగులను గుర్తిస్తే తక్షణమే వైద్యశాఖకు పూర్తి వివరాలను అందజేయాలని కోరారు. లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు.

కానరాని మహిళా సాధికారత



ఐద్వా పతాకావిష్కరణ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): బీజేపీ పాలనలో మహిళా సాధికారత ఎండమావిలా మారిందని ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్‌బీ, శివకుమారి ఆరోపించారు. ఐద్వా ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని బాలాజీనగర్‌లో సంస్థ పతాకాన్ని బుధవారం ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడారు. మహిళలపై దాడులు, లైంగిక వేధింపులు ఎక్కువయ్యాయని ఆరోపించారు. జీఓ నంబర్ 117 పేరుతో ప్రభుత్వ పాఠశాలలను మూసేస్తే చదువుకు బాలికలు దూరమయ్యే ప్రమాదం ఉందని చెప్పారు. నేతలు సుబ్బమ్మ, శంషాద్, సంపూర్ణమ్మ, రెహనుమా, రమణమ్మ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అరుదైన చికిత్సతో ప్రాణాలు కాపాడి



మాట్లాడుతున్న శ్రీనివాసరాజు

నెల్లూరు(అర్బన్): నగరంలోని కిమ్స్ సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రిలో ఓ వ్యక్తి గుండెకు బైఫర్‌కేషన్ స్టంటింగ్ అనే నూతన చికిత్సను అందించి ప్రాణాలను కాపాడామని ఆస్పత్రి గుండె డాక్టర్ శ్రీనివాసరాజు పేర్కొన్నారు. దీనికి సంబంధించిన వివరాలను ఆస్పత్రిలో విలేకరులకు బుధవారం తెలియజేశారు. నవాబుపేటకు చెందిన 54 ఏళ్ల రమణయ్య విపరీతమైన గుండెనొప్పితో తమ ఆస్పత్రికి ఈ నెల ఆరున వచ్చారని చెప్పారు. పరీక్షలు చేయగా, గుండెకు ఎడమ వైపున ఉన్న ప్రధాన రక్తనాళ విభజన ప్రాంతంలో రెండు వైపులా రక్తనాళాలు మూసుకుపోయాయనే అంశాన్ని గుర్తించామని చెప్పారు. ఈ క్రమంలో క్లిష్టమైన బయోమైమ్ బ్రాంచ్ అనే ప్రత్యేక స్టంట్ వేసి ఎలాంటి ఆపరేషన్ లేకుండానే రోగిని కాపాడి డిశ్చార్జి చేశామని వివరించారు. ఒకే స్టంట్ ఖర్చుతోనే వైద్యాన్ని అందించామన్నారు. చికిత్సను విజయవంతం చేసేందుకు డాక్టర్లు సాహెబ్‌పీర్, నాగరాజు, అశోక్ సహకరించారని పేర్కొన్నారు. డాక్టర్లను ఆస్పత్రి ఈడీ గిరినాయుడు, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సతీష్‌కుమార్ అభినందించారు.

దళారులను నమ్మి మోసపోవద్దు



ధాన్యం కొనుగోలు కేంద్రంలో అధికారులు

నెల్లూరు సిటీ: దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని, ధాన్యాన్ని కొనుగోలు చేయనున్నామని హౌసింగ్ పీడీ, నెల్లూరు రూరల్ మండల ప్రత్యేకాధికారి వేణుగోపాల్ పేర్కొన్నారు. మాదరాజుగూడూరులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ధాన్యాన్ని సరఫరా చేసిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమవుతుందని చెప్పారు. నెల్లూరు వ్యవసాయ సహాయ సంచాలకుడు శ్రీనివాసులు, మండల వ్యవసాయాధికారి నాగమోహన్, సర్పంచ్ వెంకటేశ్వర్లు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో అపహరణ

నెల్లూరు(క్రైమ్): రహదారిపై ఆటోను నిలిపి టీ తాగొచ్చేలోపు గుర్తుతెలియని దుండగులు అపహరించిన నగరంలోని బాబూ ఐస్‌క్రీమ్స్ సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు.. కోవూరు మండలం పోతిరెడ్డిపాళేనికి చెందిన షఫీ నగరంలోని వీఆర్సీ సెంటర్ నుంచి ఆత్మకూరు బస్టాండ్ వరకు ఆటోను నడుపుకొని జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఆత్మకూరు బస్టాండ్‌కు మంగళవారం రాత్రి సుమారు 8.30 గంటల సమయంలో బయల్దేరారు. మార్గమధ్యలో బాబూ ఐస్‌క్రీమ్స్ వద్ద ఆటోను నిలిపి టీ తాగేందుకు ఎదురుగా ఉన్న కేఫ్‌కు వెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు అపహరించుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సంతపేట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): ఆటో డ్రైవర్ అదృశ్యమైన ఘటనపై కేసును నవాబుపేట పోలీసులు నమోదు చేశారు. వివరాలు.. నవాబుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని టిడ్కో ఇళ్లలో నివాసం ఉంటున్న మల్లికార్జున అప్పులపాలయ్యారు. ఈ క్రమంలో భార్య రాజేశ్వరితో కలిసి స్టోన్‌హౌస్‌పేటలోని తన మేనత్త ఇంటికి ఈ నెల ఎనిమిదిన వెళ్లారు. ఇప్పుడే వస్తానంటూ బయటకెళ్లిన ఆయన జాడ తెలియరాలేదు. గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు రాజేశ్వరి ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏప్రిల్‌లో అవార్డుల ప్రదానం

నెల్లూరు(బృందావనం): సాహిత్యంలో విశేష కృషి చేసిన సాహితీవేత్తలకు అవార్డులను నగరంలో వచ్చే నెల్లో అందజేయనున్నామని చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్ చైర్మన్ చిన్నినారాయణరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కవి ప్రసాదమూర్తికి చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్ అవార్డును అందజేయనున్నామని వివరించారు. అదే విధంగా పలువురికి పురస్కారాలను ప్రదానం చేయనున్నామని చెప్పారు.

అనధికార మద్యం విక్రేత అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): కొత్తకాలువ సెంటర్ వద్ద అనధికారికంగా మద్యాన్ని విక్రయిస్తున్న అదే ప్రాంతానికి చెందిన ఫణీంద్రను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ నెల్లూరు – 1 అధికారులు అరెస్ట్ చేశారు. అతని నుంచి పది క్వార్టర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నగరంలోని వివిధ ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం చేస్తున్న ఐదుగుర్ని అరెస్ట్ చేశారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌బాబు, ఎస్సై మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించండి



సీడీపీఓలతో సమావేశాన్ని నిర్వహిస్తున్న ఆర్జేడీ

నెల్లూరు(పొగతోట): అంగన్‌వాడీ కార్యకర్తలు సమయపాలనను పాటించి పిల్లలు, బాలింతలకు పౌష్టికాహారాన్ని సకాలంలో అందించాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆర్జేడీ జయలక్ష్మి ఆదేశించారు. నగరంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బాలింతలు, చిన్నపిల్లలకు సకాలంలో పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. సీడీపీఓలు క్షేత్రస్థాయిలో పర్యటించి అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. నాణ్యత లోపించిన సరుకులను సరఫరా చేస్తే వెంటనే వాటిని వెనక్కి పంపాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు విధులకు గైర్హాజరైన సమయంలో మాత్రమే వారి వేతనాలను కట్ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఐసీపీఎస్ అధికారి సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన



నెల్లూరు(బారకాసు): నగరంలోని 12, 13వ డివిజన్ల పరిధిలో గల చింతారెడ్డిపాళెం, యలమవారిదిన్నె ప్రాంతాల్లో పారిశుధ్య పనులను ఎంహెచ్‌ఓ చైతన్య బుధవారం పరిశీలించారు. ఇంటింటి చెత్త సేకరణతో పాటు కాలువల్లో పూడికతీత పనులను పర్యవేక్షించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేను నిర్వహించి ప్రజల అభిప్రాయాలను సేకరించారు.

సొసైటీ కార్యాలయ ప్రారంభం



నెల్లూరు రూరల్: కలెక్టరేట్ ఆవరణలోని గోల్డెన్ జూబ్లీ హాల్లో జిల్లా రెవెన్యూ స్టాటిస్టికల్, సర్వే ఎంప్లాయీస్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీని కలెక్టర్ ఆనంద్ బుధవారం ప్రారంభించారు. తొలుత కలెక్టర్‌కు రెవెన్యూ అధికారులు స్వాగతం పలికారు. డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, సొసైటీ అధ్యక్షుడు చొప్పా రవీంద్రబాబు, గౌరవ సలహాదారు దూబగుంట మధుసూదన్‌శర్మ, కార్యదర్శి శేషయ్య, కోశాధికారి శ్రీనివాసులు, డైరెక్టర్లు నాగశేఖర్, శ్యామ్‌కుమార్, సూర్యనారాయణ, జయజయరావు, సతీష్‌కుమార్, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

సర్వేను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న నందన్

నెల్లూరు(బారకాసు): స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేను నగరపాలక సంస్థ పరిధిలో విజయవంతం చేయాలని అదనపు కమిషనర్ నందన్ సూచించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో పారిశుధ్య విభాగాధికారులు, సిబ్బందితో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వినూత్నమైన ఆలోచనలతో ఫ్లోర్ పాయింట్ల వద్ద చెత్త వేయడాన్ని విజయవంతంగా అరికట్టిన పారిశుధ్య మేస్త్రీలను అభినందించారు. నగరంలోని బ్లాక్ స్పాట్లను గుర్తించి ఆయా ప్రాంతాలను శుభ్రం చేసి రంగవల్లులు, పూల కుండీలను ఉంచి అక్కడ చెత్త వేయకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలో పొందుపర్చిన 10 ప్రశ్నలను ప్రజలకు వివరించి వారి అభిప్రాయాలను సేకరించాలని సూచించారు. ఎంహెచ్‌ఓ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన



నెల్లూరు (టౌన్): ఆర్థిక వ్యవస్థలో వ్యవస్థాపకత ప్రాధాన్యంపై నగరంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు అవగాహనను బుధవారం నిర్వహించారు. విశాఖపట్నం ఎమ్మెస్మెఈ – డీఎఫ్ అసిస్టెంట్ డైరెక్టర్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పరిశ్రమల కేంద్ర జిల్లా డిప్యూటీ డైరెక్టర్ బాషా, ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, గూడూరులోని నారాయణ కళాశాల ప్రిన్సిపల్ రవిప్రసాద్, అధ్యాపకులు రాజేంద్ర, వెంకటేశ్వర్లు, మురళి, చంద్రమోహన్‌రెడ్డి, నాగవేణి తదితరులు పాల్గొన్నారు.

సింహవాహనంపై రంగడి చిద్విలాసం





నెల్లూరు(బృందావనం): బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని నగరంలోని తల్పగిరి రంగనాథ దేవస్థానంలో స్వామివారికి విశేష పూజలను బుధవారం నిర్వహించారు. సింహవాహనం, చంద్రప్రభ వాహనాలపై రంగనాథుడు విహరించారు. చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

⇒ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని వెణ్ణత్తాళి ఉత్సవం, హనుమంతసేవను గురువారం నిర్వహించనున్నామని ఈఓ ఆళ్ల శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ఆక్రమణదారుడ్ని వెంటనే ఖాళీ చేయించాలి



నెల్లూరు సిటీ: మట్టెంపాడులో ఆక్రమించిన భూమి నుంచి రాచమల్లు రమేష్‌ను వెంటనే ఖాళీ చేయించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఆలూరు తిరుపాల్, మండల కార్యదర్శి పూడిపర్తి జనార్దన్ పేర్కొన్నారు. మట్టెంపాడు, మొగళ్లపాళెంలో బుధవారం నిర్వహించిన ప్రజా చైతన్య యాత్రల్లో వారు మాట్లాడారు. 15 ఎకరాలను ఆక్రమించి మామిడి మొక్కలు నాటి రాచమల్లు రమేష్ విక్రయించారని ఆరోపించారు. నెల్లూరు రూరల్ తహసీల్దార్ ఇక్కడ 145వ సెక్షన్‌ను విధించినా ఎలాంటి ప్రయోజనం లేదని చెప్పారు. మొగళ్లపాళెంలో నిర్మించిన షటిల్ బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియాలు పూర్తయ్యాయని, వీటిని అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. సీపీఎం నేతలు రమణ, గుంటి నాగరాజు, రవీంద్ర, దయాకర్, వెంకటశేషయ్య తదితరులు పాల్గొన్నారు.